క్లుప్తంగా

ప్రభుత్వ మోసపూరిత పాలనను ఎండగడతాం



పెనమలూరు: రాష్ట్రంలో కూటమి మోసపూరిత పాలనను ఎండగడతామని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఐయామ్ విత్ వైఎస్సార్ సీపీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. చక్రవర్తి మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి నేతలు ప్రజలకు ఆచరణ యోగ్యం కాని అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో సొమ్ము లేదని, హామీలు అమలు చేయలేక పోతున్నామని కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలోనే చంద్రబాబునాయుడికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పూర్తి అవగాహన ఉండే ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రజలతో వైఎస్సార్ సీపీ శ్రేణులు కలిసి న్యాయం జరిగే విధంగా పోరాటం చేస్తామని అన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటాలు చేయాలి



గన్నవరం: స్థానిక చింతపల్లి పాపారావు స్మారక భవనంలో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరంతర పోరాటాలు సాగించాలని చెప్పారు. నెలల తరబడి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ నిర్వాహకం కారణంగా విద్యా సంస్థలు ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా క్రాంతి, వీజీ.ధీరజ్, ఆఫీస్ బైరేట్స్‌గా మానిష్, ప్రిన్స్, హస్సేన్, రోహి, ప్రణయ్ ఎన్నికయ్యారు. పార్టీ నేతలు జోషి, విజయరావు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన



హనుమాన్‌జంక్షన్ రూరల్: పెట్రోల్ బంకుల్లో నిర్లక్ష్యంగా ధూమపానం చేయటం, పేలుడు పదార్థాలను తీసుకువెళ్లటం ఎంతో ప్రమాదకరమని హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం అధికారి జీఆర్ మోహనరావు హెచ్చరించారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక నూజివీడురోడ్డులోని సీతారామపురం, మర్రిబంధం పెట్రోల్ బంక్‌ల్లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పెట్రోల్ బంక్‌లో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను అక్కడ పని చేస్తున్న సిబ్బందికి వివరించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన నియంత్రణ చర్యలను, మంటలను అదుపు చేసే పద్ధతులను ప్రదర్శనల ద్వారా వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

పెనమలూరు: పోరంకి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు అవ్వటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు ఇంజినీరింగ్ కాలేజీ ఎదురుగా ధనలక్ష్మి టవర్స్‌కు చెందిన నిమ్మగడ్డ శ్రీనివాస్‌బాబు బ్యాంకు పనిపై పోరంకి వచ్చాడు. పెనమలూరుకు వెళ్లటానికి పోరంకి తూముల సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా కంకిపాడు వైపు నుంచి వచ్చిన బైక్ ఢీ కొట్టడంతో కాలు విరిగింది. అతన్ని విజయవాడ ఆస్పత్రిలో చేర్చారు.బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేపటి నుంచి యోగా శిక్షణ శిబిరం

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంక వాసవి సేవా సంఘంలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవాకేంద్రం కృష్ణలంక శాఖ ఆధ్వర్యాన ఈ నెల 20వ తేదీ ఉదయం 6.30 గంటలకు 963వ నూతన ఉచిత యోగ శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్నట్లు బోధక యోగాచార్యులు పోకూరి గోవర్ధనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. 8 నుంచి 80 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు శిక్షణలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 98481 53417, 99127 93312 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సీసీ డ్రెయిన్ నిర్మాణం.. లోపాలమయం

- సీసీ డ్రెయిన్ నిర్మాణంలో లొసుగులు
- ఎలైన్‌మెంట్‌లో లోపాలు
- ఆక్రమణలు తొలగించకుండానే నిర్మాణం
- సక్రమంగా నిర్మించకపోతే ప్రయోజనం లేదంటున్న ప్రజలు



తిన్నగా లేని డ్రెయిన్



రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామ పరిధి తాడిగడప డొంక రోడ్డులో సీసీ డ్రెయినేజీ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో ఉన్న ఆక్రమణలు తొలగించకుండా కొందరికి ప్రయోజనం చేకూరే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. నిర్మాణం చేస్తున్న డ్రెయినేజీ ఎలైన్‌మెంట్ సక్రమంగా లేదని, డ్రెయినేజీ నిర్మాణం చేయటం వలన ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

వివరాల్లోకి వెళితే..

యనమలకుదురు గ్రామం తాడిగడప డొంక రోడ్డులో ఇటీవల కాలంలో భవనాల నిర్మాణం అధికంగా జరిగింది. అయితే డ్రెయినేజీ వ్యవస్థ లేక పోవటంతో వర్షాకాలంలో సమస్య తీవ్రంగా ఉంటోంది. అదే విధంగా మురుగునీరు పారుదల కూడా జరగక స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

రూ.35 లక్షల నిధులతో..

దీంతో తాడిగడప మున్సిపాలిటీ రూ.35 లక్షల నిధులు డ్రెయినేజీ నిర్మాణానికి మంజూరు చేశారు. వినాయక్‌నగర్ 3వ లైన్ నుంచి హైదర్ మసీదు వరకు దాదాపు 380 మీటర్ల మేర డ్రెయినేజీ నిర్మాణం చేయాలని అంచనాలు వేశారు. ఈ మేరకు రోడ్డు సర్వే చేశారు. కొద్ది రోజుల క్రితం పనులు ప్రారంభించారు.

డ్రెయినేజీ నిర్మాణంలో లోపాలు..

కాగా డ్రెయినేజీ నిర్మాణం పనుల్లో అనేక లోపాలు ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి. రికార్డుల ప్రకారం రోడ్డు మార్జిన్‌లో డ్రెయినేజీ నిర్మాణం జరగటంలేదని ప్రధాన ఆరోపణ. రోడ్డు పక్కన ఆక్రమణలు పూర్తిగా తొలగించకుండానే డ్రెయినేజీలు నిర్మిస్తున్నారు. ప్రధానంగా మూడు సమాధుల సెంటర్‌లో, వాటర్ ప్లాంట్ ప్రాంతంలో ఆక్రమణలను అధికారులు పూర్తిగా తొలగించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ డ్రెయినేజీ అనేక వంకర్లు తిప్పి ఎలైన్‌మెంట్ చేయకుండా డ్రెయినేజీ నిర్మాణం పనులు చేస్తున్నారు. దీనిపై స్థానికులు అభ్యంతరం తెలిపినా ఏకపక్షంగానే డ్రెయినేజీ నిర్మాణం చేస్తున్నారు. ఈ కారణంగా రోడ్డు వెడల్పు తగ్గిపోయి భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యే కాకుండా డ్రెయినేజీలో మురుగునీరు పారుదల సక్రమంగా జరిగే అవకాశం ఉండదని అంటున్నారు.



వాటర్ ప్లాంట్ వద్ద మలుపు తిరిగిన డ్రెయిన్

అధికారులు స్పందించాలి..

తాడిగడప డొంక రోడ్డులో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులపై అధికారులు వెంటనే స్పందించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. డ్రెయినేజీ అనేక మలుపులతో నిర్మాణం చేయటం వలన ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలం వదిలేసి డ్రెయినేజీ నిర్మాణం చేస్తే రోడ్డు వెడల్పు తగ్గుతుందని, దీనిపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డ్రెయినేజీ సక్రమంగా నిర్మించాలి..



తాడిగడప డొంకరోడ్డులో డ్రెయినేజీ నిర్మాణం సక్రమంగా జరగాలి. ఆక్రమణలు తొలగించి డ్రెయినేజీ నిర్మాణం చేస్తే ప్రయోజనంగా ఉంటుంది. డ్రెయినేజీ నిర్మాణంలో లోపాలు ఉంటే భవిష్యత్తులో నష్టం జరుగుతుంది.

-పి.ఉమాశంకర్, యనమలకుదురు

కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ



కంకిపాడు: కార్యకర్తల కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. కంకిపాడు పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పైడిపల్లి చంద్ర వైద్య ఖర్చులకు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అందించిన రూ.5 వేల ఆర్థికసాయాన్ని గురువారం రాత్రి అందించారు. బాకీ బాబు మాట్లాడుతూ చంద్ర అనారోగ్య సమస్యపై రూ.10 వేలు వెచ్చించి ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయించారన్నారు. మందుల కొనుగోలు నిమిత్తం మరో రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు తంబాబత్తుల ఓంకారం, మాదు రాఘవేంద్ర, చుండూరు మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీ కొట్టిన లారీ

పెనమలూరు: కానూరు 100 అడుగుల రోడ్డులో కారును లారీ ఢీ కొట్టడంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. విజయవాడ రామవరప్పాడు రింగ్ ప్రాంతానికి చెందిన కంఠమనేని అనుపమ తన కుమారుడితో గురువారం కారులో వెళుతుండగా తాడిగడప జంక్షన్ వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ అతి వేగంగా వచ్చి కారును ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో వ్యక్తులకు గాయాలు అవ్వగా కారు ధ్వంసమయింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు

- పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో నిర్వహణ
- సిలువ మార్గంలో పాల్గొన్న భక్తులు



కానూరు కార్మెల్ మాత దేవాలయం వద్ద సిలువ మార్గం ప్రదర్శన

ఉయ్యూరు: పెనమలూరు, గన్నవరం నియోజవర్గాల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉయ్యూరు పట్టణంలోని అన్ని ప్రార్థనామందిరాల్లో శుక్రవారం ప్రార్థనలు నిర్వహించారు. అంబేడ్కర్‌నగర్‌లోని ఆర్‌సీఎం ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో సిలువ యాత్ర నిర్వహించారు. ప్రధానసెంటరులో క్రీస్తు బోధనలు చేశారు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తునిచక్రవర్తి సిలువను మోస్తూ సిలువ యాత్రలో పాల్గొన్నారు. క్రీస్తు విశ్వాసులు అందరికీ గుడ్‌ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో మున్సిపల్ వైస్‌చైర్మన్ సోలే సురేష్‌బాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబ్దుకలాం, కో ఆప్షన్ సభ్యుడు షేక్ కలీల్, నాయకులు పెనుమూడి సంజయ్, బెజవాడ నాగబాబు, సలీంబేగ్, బ్రహ్మం, కేవైకే రెడ్డి, పినమాల నాగకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబాపురం(విజయవాడరూరల్): యేసుక్రీస్తు ద్వారానే మానవాళికి జీవజలం లభిస్తోందని అంబాపురం సీఎస్ఐ చర్చి డీనరి చైర్మన్ చిలువూరి జయరాజు తెలియజేశారు. పవిత్ర శుక్రవారాన్ని పురస్కరించుకొని అంబాపురం చర్చిలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనాకార్యక్రమం జరిగింది. యేసుక్రీస్తు సిలువ శ్రమలు, ప్రాణార్పణ అంశంపై ఆయన భక్తులకు వివరించారు. నున్న సీఎస్ఐ చర్చి, అహరోను ప్రార్థనా మందిరం, దైవస్వరూపి ప్రార్థనా మందిరం, బేతేలు ప్రార్థనా మందిరం, పాతపాడు గ్రామంలో సిఎస్ఐ చర్చి, కల్వరి ప్రార్థనా మందిరం, కొత్తనిబంధన సంఘం ఇంకా మండలంలోని పలుగ్రామాల్లో క్రైస్తవుల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మానవాళి పాపాలకు యేసుక్రీస్తు ఎన్నో శ్రమలు అనుభవించి, కొరడాదెబ్బలు తినడం, ముళ్లకిరీటం ధరించడం, సిలువపై కాళ్ల చేతులకు మేకులు బిగించడం, త్యాగపూరితమైన మరణాన్ని స్మరించుకొంటూ భక్తులు విషాద గీతాలను ఆలపిస్తూ ఉపవాసంతో ప్రార్థనలు చేశారు.

నున్న(విజయవాడరూరల్): దైవత్వం, మానవత్వాన్ని వెల్లడిచేస్తోందని నున్న ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జోషి పేర్కొన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా నున్న విచారణ జేసు తిరుహృదయ దేవాలయం ఆధ్వర్యంలో బోడపాడు గ్రామం నుంచి నున్న దేవాలయం వరకు యేసుక్రీస్తు మానవాళి కోసం పడిన శ్రమలను ప్రజలకు వివరిస్తూ సిలువ మార్గం నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ అజ్జు,ఫాదర్ ఎన్నారెడ్డి, ఫాదర్ పీటర్,సెంటాన్స్ సిస్టర్స్ ,ఎంసీ బ్రదర్స్ ,సంఘస్థులు,భక్తులు సుమారు రెండు వేల మంది పాల్గొన్నారు.

పెనమలూరు: పవిత్ర గుడ్ ఫ్రైడే సందర్భంగా కానూరు కార్మెల్ మాత దేవాలయం ఆధ్వర్యంలో సజీవ సిలువ మార్గం భక్తిశ్రద్ధలతో చేశారు. దేవాలయం విచారణ గురువు ఫాదర్ సలివేంద్ర శౌరి సహకారంతో సిలువ మార్గం 14 స్థలములు నిర్వహించారు. పోరంకి సాలిసేట నుంచి బందరు రోడ్డు మీదగా పెనమలూరు జంక్షన్, పోరంకి, తాడిగడప, కామయ్యతోపు కానూరు కార్మెల్ చర్చి వరకు సిలువ మార్గం నిర్వహించారు. సజీవ సిలువ మార్గం వేషధారణ పాత్రలు చూపరులకు భక్తి మార్గంలో నడిపించింది. ఫాదర్లు శౌరి, దేవదానం, రత్నారాజు దివ్యబలి పూజలు నిర్వహించి భక్తులకు దివ్య సత్ప్రసాదాలు అందజేశారు. సీటీసీ సిస్టర్స్, ఉపదేశకులు, దీక్షాపరులు, యూనిట్స్ లీడర్స్, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. పోరంకిలో కూడా ఏసు సిలువ మార్గం భక్తిశ్రద్ధలతో చేశారు. గ్రామంలో బీజేఆర్‌నగర్ నుంచి పోరంకి సెంటర్ వరకు భక్తులు సిలువ మార్గంతో ప్రదర్శనగా వెళ్లి భక్తి గీతాలు ఆలపించారు. వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు అద్దేపల్లి చందు భక్తులకు అరటి పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. పెనమలూరులో కొత్త నిబంధన సంఘంలో గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పునీత అంథోని దేవాలయం ఆధ్వర్యంలో పవిత్ర సిలువ మార్గం నిర్వహించారు. విచారణకర్తలు రెవ.ఫాదర్ నూతలపాటి కిషోర్ నేతృత్వంలో భక్తులు సిలువను మోసుకుంటూ గ్రామ వీధుల్లో ఊరేగింపు జరిపారు. అనంతరం చర్చిలో పవిత్ర సిలువ ఆరాధన, సత్ప్రసాదం అందజేశారు. సిలువ మార్గం ప్రదర్శనలో సంఘ పెద్దలు, పెద్ద సంఖ్యలో యువతి, యువకులు, విశ్వాసులు పాల్గొన్నారు. గన్నవరంలోని ఆర్‌సీఎం బాలయేసు దేవాలయం ఆధ్వర్యంలో సిలువమార్గం యాత్ర నిర్వహించారు. ఫాదర్ పసల థామస్ నేతృత్వంలో క్రీస్తు చేసిన త్యాగాన్ని స్మరించుకుంటూ భక్తులు సిలువ మార్గంలో పాల్గొన్నారు.

కంకిపాడు: గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రీస్తు విశ్వాసులు భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. మండలంలోని అన్ని ప్రార్థనామందిరాల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ఆరోగ్యమాత దేవాలయం ఆధ్వర్యంలో క్రీస్తు విశ్వాసులు సిలువయాత్ర చేపట్టారు. స్థానిక బస్టాండు సెంటరులో విచారణ గురువు ఫాదర్ ఎం.సాల్మన్‌రాజు క్రీస్తు సందేశం వినిపించారు. ఆరోగ్యమాత దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ఆరోగ్యమాత దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఫాదర్ ఎం.సాల్మన్‌రాజు ప్రార్థనలు జరిపించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, జిల్లా అధికార ప్రతినిధి నత్తా వెంకటేశ్వరరావు, నాయకులు తంబాబత్తుల ఓంకారం, కలపాల వజ్రాలు, మాదు రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కొండపావులూరు(గన్నవరం): మండలంలోని కొండపావులూరులో ఉన్న పునీత బాప్తిస్మ యోహాను దేవాలయంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడ్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విచారణకర్తలు రెవ.ఫాదర్ తోకల సురేష్ నేతృత్వంలో పరిశుద్ధ సిలువ మార్గం గ్రామ వీధుల్లో నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, సిలువ ఆరాధన, పవిత్ర సత్ప్రసాదం ఆరాధన జరిపారు. విచారణ పరిధిలోని కొండపావులూరు, చిక్కవరం, చింతగుంట, గొల్లనపల్లి, గోపవరపుగూడెం, కట్టుబడిపాలెం, పురుషోత్తపట్నం గ్రామాలకు చెందిన భక్తులు, దీక్షాపరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక జ్యోతినగర్ ఆర్సీఎం చర్చి, సీఎస్ఐ చర్చి, హోసన్నా మందిర్, కారుణ్య ప్రార్థనామందిరం, బేతేలు చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు. శోభనాద్రిపురం, బండారుగూడెం సీఎస్ఐ చర్చిల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జ్యోతినగర్ ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్ ప్రధాన రహదారుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఏసుక్రీస్తు సిలువను మోస్తూ, గీతాలను ఆలపిస్తూ ప్రదర్శన చేశారు. ఏసుక్రీస్తు, సైనికుల వేషధారణలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ చేబ్రోలు జోసఫ్ తంబి, జేఎంజే సిస్టర్లు పాల్గొన్నారు.



బోడపాడు గ్రామంలో సిలువ మార్గం



కేసరపల్లిలో సిలువ మార్గంలో భక్తులు



హనుమాన్‌జంక్షన్‌లో సిలువ మోస్తున్న క్రైస్తవులు



అంబాపురం గ్రామంలో సీఎస్ఐ చర్చిలో..



కంకిపాడులో శిలువ యాత్రలో విశ్వాసులు



కంకిపాడులో ర్యాలీగా వెళ్తున్న విశ్వాసులు



ఉయ్యూరులో సిలువ మార్గంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి



కొండపావులూరులో సిలువమార్గం వేషధారణలతో భక్తులు

వక్ఫ్ బిల్లుకు నిరసనగా ముస్లింల మానవహారం



యనమలకుదురులో మానవ హారం చేస్తున్న ముస్లింలు

పెనమలూరు: వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా యనమలకుదురు గ్రామంలో శుక్రవారం ముస్లింలు మానవహారం చేశారు. వివిధ మసీదులకు చెందిన ముస్లింలు నమాజ్ ముగించుకున్న తరువాత తాడిగడప డొంక రోడ్డులోకి చేరుకున్నారు. ముస్లింలు ఐక్యత చాటుతూ పెద్ద ఎత్తున మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లును ముస్లిం సమాజం వ్యతిరేకిస్తుందన్నారు. ముస్లిం మనోభావాలకు వ్యతిరేకంగా బిల్లు తీసుకు వచ్చారని విమర్శించారు. ముస్లిం సమాజం అభ్యంతరం తెలిపినా ఎన్‌డీఏ కూటమి బిల్లు ఆమోదించటం దారుణమని ఖండించారు. సుప్రీం కోర్టు కూడా వక్ఫ్ బిల్లుపై పలు అభ్యంతరాలు తెలిపిందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించాలి

పెనమలూరు: మండల పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించాలని ఎంపీడీఓ బండి ప్రణవి అన్నారు. ఆమె శుక్రవారం వివరాలు తెలుపుతూ ప్రభుత్వం ప్రతి నెలా 3వ శనివారం నిర్వహించాలని ఆదేశించిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, కంప్యూటర్లు, టేబుల్స్, కుర్చీలు, ఇతర సామగ్రి పరిశుభ్రం చేయాలన్నారు. ర్యాలీలు నిర్వహించాలన్నారు.

తండ్రి కనిపించడం లేదని ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): తండ్రి కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదు పై నున్న పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవరపు నాగసాయికుమార్ తండ్రి వీరబ్రహ్మాచారి (55) నున్న గ్రామంలో ఓ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో నున్న బ్రాంచి ఇన్‌చార్జిగా పని చేస్తుంటాడు. ఈ నెల 17న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అప్పులు ఎక్కువయ్యాయి వెళ్లిపోతున్నానని ప్యాంటు జేబులో లెటర్ పెట్టాడు. మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు.

డ్రెయినేజీల నిర్మాణానికి శంకు స్థాపన

పెనమలూరు: తాడిగడప మున్సిపాలటీ పరిధి కానూరులో డ్రెయినేజీల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కానూరులో మహదేవపురం మాణిక్యనగర్ నుంచి ప్రధాన రహదారి వరకు రూ.40 లక్షలు, మాణిక్యనగర్ నుంచి వృద్ధుల ఆశ్రమం వరకు రూ.39 లక్షలు, కానూరు పెట్రోల్‌బంక్ నుంచి ప్రధాన రోడ్డు మిఠాయి షాప్ వరకు రూ.35 లక్షలతో డ్రెయినేజీలు నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.